సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



తడబాటు.. ఎడబాటు

తెలిసీ తెలియని వయస్సులో ప్రేమ వివాహం చేసుకున్న జంటలు ఆ తరువాత సమస్యల సుడిగుండంలో చిక్కుకుంటున్నాయి. 8లో▸



విద్యార్థినుల అస్వస్థతపై..

తాండూరు మండలంలోని వసతి గృహంలో విద్యార్థినుల అస్వస్థతపై కలెక్టర్ నారాయణరెడ్డి విచారణకు ఆదేశించారు. 8లో▸



అడవుల నరికివేతపై చర్యలు

పోడు భూముల కోసం అడవిని నరికితే కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్ హెచ్చరించారు. 8లో▸



తాండూరు: ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



దౌల్తాబాద్: ముస్లింల ప్రార్థనలు



అనంతగిరి: చిన్నారుల ఆలింగనం

ఈద్ ముబారక్

జిల్లా వ్యాప్తంగా గురువారం రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరి నొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పేదలకు అన్నదానం చేశారు. చిన్నారులు అందమైన దుస్తుల్లో సందడి చేశారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న చిన్నారులు

న్యూస్‌రీల్

వాహన తనిఖీల్లో నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసులు

బషీరాబాద్: మండలంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద గురువారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో నగదు లభించింది. ఎస్ఐ రమేష్‌కుమార్ కథనం మేరకు.. హెడ్‌కానిస్టేబుల్ లోక్యానాయక్, కానిస్టేబుల్ రాందాస్, కేంద్ర బలగాలు రోజువారి విధుల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేశారు. షాదీపూర్ గ్రామానికి చెందిన పటేల్ మనోజ్‌కుమార్ బైక్‌పై కర్ణాటకకు వెళుతున్నాడు. వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అతని వద్ద రూ.1,15,460 నగదు లభించింది. డబ్బుకు సంబంధించి ఎలాంటి రసీదు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కేసీఆర్ సభా ఏర్పాట్ల ప్రారంభం



పార్టీ నాయకులతో కలిసి సభా ఏర్పాట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ఫరా ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఈనెల 13న బీఆర్ఎస్ పార్టీ నిర్వహించనున్న బహిరంగ సభా ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం కేసీఆర్ చేపట్టే బస్సు యాత్రను ఇక్కడి నుంచే ప్రారంభించనున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరారు. చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేపట్టనున్నట్టు చెప్పారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఎం. బాల్‌రాజ్, ప్రభాకర్, అనంత్‌రెడ్డి, రాంరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పాపారావు, మోహన్‌రెడ్డి, మహేందర్, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.


బీజేపీ ఎండోమెంట్ సెల్ సభ్యుడిగా వెంకట్‌రాంరెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న వెంకట్‌రాంరెడ్డి

చేవెళ్ల: బీజేపీ ఎండోమెంట్ సెల్ (ధార్మిక పరి షత్) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మండలంలోని పలుగుట్ట గ్రామానికి చెందిన కె. వెంకట్‌రాంరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ తనకు నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని పేర్కొన్నారు. సహచర కార్యకర్తలు, పార్టీ ఇతర కమిటీలతో కలిసి అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహ కరించిన పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎండోమెంట్‌సెల్ స్టేట్ కన్వీనర్ సూర్యప్రకాశ్, కో కన్వీనర్ నింజన్ దేశాయి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నట్లు తెలిపారు. వెంకట్‌రాంరెడ్డి నియాకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో రాజకీయ సందడి



ఏ నలుగురు కలిసినా ఎన్నికలపైనే చర్చ

- ఎవరికి వారే సర్వే
- సోషల్ మీడియాలో పోస్టింగులు
- ఊపందుకుంటున్న ప్రచారం

పరిగి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పట్నం నుంచి పల్లె వరకు రాజకీయ వేడి మొదలైంది. ఎక్కడ నలుగురు కలిసినా ఎంపీ ఎన్నికలపైనే చర్చలు జరుపుతున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించాయి. అభ్యర్థులు, నేతలు ప్రచారంలో బిజీ అయ్యారు. బీజేపీ ముందస్తుగా అభ్యర్థిని ప్రకటించి ప్రచారాన్ని ప్రారంభించింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో ఆయా పార్టీలకు ప్రజలే ఎన్నికల జోస్యం చెబుతున్నారు. ఏ పార్టీ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వస్తాయి.. ఏ నాయకుడి వెనుక ఎక్కువ మంది జనం ఉన్నారో లెక్కల్లో మునిగిపోయారు. గ్రామ పంచాయతీలు, హోటళ్లు, రచ్చ కట్టలు రాజకీయ చర్చలకు వేదికలుగా మారిపోయాయి. అంతేకాకుండా ఏ శుభకార్యమైనా, ఏ విందైనా నలుగురు పోగైతే చాలు ఎంపీ ఎన్నికలపైనే ముచ్చటిస్తున్నారు. ఆ నాయకుడు చాలా బలవంతుడని, ఫలానా వ్యక్తి రాజకీయాలను శాసిస్తాడంటూ చర్చలు పెడుతున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలు వికారాబాద్, పరిగి, తాండూరు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఉండగా.. కొడంగల్ నియోజకవర్గం మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఉంది.

సొంత సర్వేలు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎవరికి వారే సర్వే చేశామని చెప్పుకుంటున్నారు. ఫలానా వ్యక్తి గెలుపు ఖాయమంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. చేయడం పరిపాటిగా మారింది. మరో పక్క సోషల్ మీడియాలో సైతం తమ అభిప్రాయాలను, సర్వేలను షేర్ చేస్తున్నారు. తమ నియోజకవర్గంలో ఏ పార్టీ నాయకుడికి మద్దతు ఇస్తారంటూ ఒపీనియన్ పోల్‌ను నిర్వహిస్తున్నారు.

నలుగురు కలిస్తే చర్చే

జిల్లాలో రాజకీయం వేడెక్కింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల ప్రచారం జోరందుకుంది. గ్రామాల్లో పార్టీల జెండాలు, తోరణాలతో రెపరెపలాడుతున్నాయి. ఎక్కడ నలుగురు కలిసినా ఒక్కటే చర్చ నడుస్తోంది. ఈ ఎన్నికల్లో మా పార్టీ నాయకుడే గెలుస్తారని, కేంద్రంలో తామే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ముందస్తు జోస్యంతో నేతల్లో గుబులు

సోషల్ మీడియలో వచ్చే షేరింగ్‌లు, రిజల్ట్‌ల కారణంగా నేతల్లో బెంగ పట్టుకుంది. పోలింగ్‌కు ఇంకా నెల రోజుల గడువు ఉండగానే ప్రజల నాడి ఇలా ఉందంటూ జోస్యం చెప్పేవాళ్లు ఎక్కువ కావడం ఇందుకు కారణం. ఇంతకుముందు పోలింగ్ తర్వాత ఓటింగ్ సరళిని బట్టి ఎవరు గెలుస్తారో ఓ అంచనాకు వచ్చేవారు. ఇంకా పోలింగ్ కాకముందే ఫలానా నాయకుడి పని ఖతమంటూ ముందే భయపడేలా జోస్యం చెబుతుండటం నేతలకు మింగుడు పడటం లేదు. బెల్టు షాపులు, బార్లలో నేతల గెలుపోటములపై ఒకటే చర్చ నడుస్తున్నట్లు తెలుస్తోంది. మౌత్ పబ్లిసిటీ కూడా ఊపందుకుంది.

పోటాపోటీ పోస్టింగ్‌లు

అధికారంలోకి మేము వస్తామంటే మేము వస్తామని సోషల్ మీడియా వేదికగా పోస్టింగులు జోరందుకున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సోషల్ మీడియలో పోటాపోటీగా క్లిప్పింగ్‌లు, వీడియోలు షేర్ చేస్తున్నాయి. గ్రామాల్లో కూడా రాజకీయ పార్టీల గ్రూపులు ఏర్పాటు చేసుకొని సందేశం వచ్చిన వెంటనే మిగిలిన వారికి షేర్ చేస్తున్నారు.

మరో నాలుగు రోజులే..

- ఈనెల 15తో ముగియనున్న ఓటరు నమోదు
- ఏప్రిల్ 18 నుంచి నామినేషన్ల స్వీకరణ
- మే 13న పోలింగ్

వికారాబాద్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ మే 13న జరగనుంది. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 15 వరకు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఓటేసే అవకాశం ఉంది. ఇప్పటికే బూత్‌స్థాయి అధికారులు(బీఎల్‌ఓలు) తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయా ల్లో ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని పరిశీలించి పేరు లేకుంటే నమోదుకు ఫాం–6 ద్వారా తహసీల్దార్‌కు దరఖాస్తు అందించొచ్చు.

❖ ఓటర్ల అనుబంధ జాబితాను ఈ నెల 25న ప్రకటించనున్నారు.ఫిబ్రవరి 8న తుది జాబితాను వెలువరించిన విషయం విధితమే. ఆ తర్వాతి నుంచి ఈనెల 15 వరకు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం కల్పి ంచారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హుల పేర్లను ఈ అనుబంధ జాబితాలో ముద్రించనున్నారు.

❖ 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే తరహాలో యువ ఓటర్ల నమోదును అధికారులు ప్రోత్సహించారు. నవంబర్ 30న పోలింగ్ నిర్వహించగా, సరిగ్గా నెల రోజుల ముందు వరకు అంటే అక్టోబర్ 31 వరకు ఓటు హక్కు నమోదుకు అవకాశం కల్పించారు. పరిశీలన అనంతరం నవంబర్ 11న ఓటరు తుది జాబితా ప్రకటించారు. గత జాబితాతో పోలిస్తే జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 40 వేల మంది యువ ఓటర్ల సంఖ్య పెరిగింది. ఈసారి కూడా ఏప్రిల్ 15 వరకు 18 ఏళ్లు నిండిన వారందరికీ అవకాశం కల్పించడంతో ఈ సంఖ్య మరింత పెరిగే చాన్స్ ఉంది.

❖ 18 ఏళ్ల వయసు నిండిన వారంతా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2006 మార్చి 31 లోగా పుట్టిన ప్రతి ఒక్కరూ ఓటరుగా ఫాం–6లో పేరు నమోదు చేసుకోవచ్చు. ఫాం–6తో పాటు వయసు ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటో జతపరిచి సంబంధిత బీఎల్‌ఓకు అందించాలి. ఓటరు జాబితాలో పేరు గల్లంతైన వారు, అర్హత ఉండి ఇప్పటి వరకు ఓటరుగా నమోదు కాని వారు ఫాం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఓటర్లు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్లు
మహేశ్వరం	511	5,55,978	2,84,913	2,70,996	69
రాజేంద్రనగర్	535	5,99,585	3,10,863	2,88,684	38
శేరిలింగంపల్లి	622	7,47,673	3,95,460	3,52,069	144
చేవెళ్ల	298	2,69,087	1,35,261	1,33,820	06
పరిగి	269	2,66,273	1,33,625	1,32,639	09
వికారాబాద్	284	2,31,679	1,15,019	1,16,647	13
తాండూరు	269	2,4,3,849	1,18,228	1,25,614	07

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

- చేవెళ్ల ప్రజల కోసం నా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

తాండూరు రూరల్: చేవెళ్ల ప్రజల సమస్యలు వినేందుకు నా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. గురువారం గౌతాపూర్ శివారులోని వీరశైవ ఫంక్షన్ హాల్‌లో మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఎంపీగా చేవెళ్ల ప్రజలకు చేసిన సేవను గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి అవకాశం ఇచ్చినట్లు చెప్పారు.తనను కలిసేందుకు ప్రజలు ఖర్చులు భరించి హైదరాబాద్ రావొద్దని, కేవలం ఫోన్ చేస్తే చాలు స్పందిస్తానని తెలిపారు. నేను ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కుటుంబంలో ఒక్కడినని, కుటుంబ సభ్యులకు ఆపద వస్తే వెంటనే స్పందించి సేవ చేస్తానని అన్నారు. మాజీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఉంటేనే ప్రజలను కలుస్తారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని.. ఎందుకు ఇవ్వలేదో ప్రధాని మోదీని ప్రశ్నించాలని యువకులకు సూచించారు. రామ మందిరం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు.

పనిచేసే వారికి గుర్తింపు: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. కొత్త, పాత నాయకులను కలుపుకొని వెళతామని తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం నారాయణపూర్, అంతారం తండా, కోత్లాపూర్, మల్కాపూర్, కోటబాసుపల్లి, కోనాపూర్, చెన్‌గేస్‌పూర్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు వడ్డె శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు ధారాసింగ్, ఉత్తమ్‌చందు, జనార్దన్‌రెడ్డి, రవిగౌడ్, రాజ్‌కుమార్, మురళీగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రఘునాథ్‌రెడ్డి, రాజుగౌడ్, పండరి, రవి సింథే తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

నేత్రపర్వం.. రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న సీఎం సతీమణి గీతారెడ్డి



చంద్రప్రభ వాహనంపై శ్రీవారు

- తిరుమల తరహాలో వేడుక
- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ సతీమణి గీతారెడ్డి

కొడంగల్: ఉభయ దేవేరుల సమేత స్వామివారు గురువారం ఉదయం రథోత్సవంపై భక్తులకు దర్శనమిచ్చారు. కొడంగల్‌లో కొలువుదీరిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి.. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మలయప్ప స్వామి రథంపై ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు, ధర్మకర్తలు ఆమెకు స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన అర్చకులు వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు.

నేడు చక్రస్నానం

శుక్రవారం ఉదయం 9గంటలకు స్వామివారి పల్లకీ సేవ, చక్ర స్నానం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఆలయ కోనేరులో స్వామివారికి స్నానం చేయిస్తారు. అనంతరం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

అట్టహాసంగా బండ లాగుడు పోటీలు

జాతర స్థలంలో గురువారం ఎద్దులతో బండ లాగుడు పోటీలు నిర్వహించారు. 10 క్వింటాళ్ల బరువు గల బండను ఎద్దులతో లాగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎద్దులతో బల ప్రదర్శన నిర్వహించారు.

పంప్‌హౌస్‌లను సిద్ధం చేయండి

- కృష్ణా జలాలు ఆగితే కాగ్నా నుంచి సరఫరా చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

తాండూరు: పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కాగ్నా నది వద్ద గల పంప్‌హౌస్‌లకు మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలో తాగునీటి సరఫరాపై ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి పట్టణ శివారులోని కాగ్నా నదిని సందర్శించారు. నది ఒడ్డున ఉన్న రెండు తాగునీటి పంప్‌హౌస్‌లను పరిశీలించారు. వాటి ద్వారా తాగునీటి సరఫరా ఎందుకు జరగడం లేదని ఆరా తీశారు. మున్సిపల్ ఆధీనంలో ఉన్నట్లు అధికారులు వివరించారు. వేసవిలో మిషన్ భగీరథ పథకానికి కృష్ణ జలాలు నిలిచిపోయే ప్రమాదం ఉన్నందున, ప్రత్యామ్నాయంగా కాగ్నా నది నీటిని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నదిలో పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ నాగేశ్వర్‌రావు, డీఈఈ శశాంత్ పాల్గొన్నారు.



కాగ్నానది వద్ద పంప్‌హౌస్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న రాహుల్‌శర్మ

క్లుప్తంగా

నేడు పూడూరులో కాంగ్రెస్ సమావేశం

పూడూరు: మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సమావేశాన్ని నిర్వహిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డిలు కార్యక్రమానికి హాజరవుతున్నారన్నారు. ఎన్నికల ప్రచారంతో పాటు కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

పూడూరు: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కండ్లపల్లి గ్రామానికి చెందిన పసుల శంకర్ (35) గురువారం వికారాబాద్ నుంచి మన్నేగూడ వైపు వస్తుండగా ఎన్కేపల్లి గేటు వద్ద బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో శంకర్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు గమనించారు. మృతుడి సోదరుడు దశరథ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం పట్టివేత

అనంతగిరి: ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేస్తుండగా ఏడు కాటన్‌ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ రాఘువీణ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం వికారాబాద్ నుంచి మన్నెగూడ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఓ కారులో 4 కాటన్‌ల బీరు సీసాలు, ద్విచక్ర వాహనంపై 3 కాటన్‌ల మద్యం లభించింది. వాటిని పరిశీలించగా అక్రమ మద్యం అని తేలింది. ఈ మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. బైక్, స్కార్పియో వాహనం స్వాధీనం చేసుకున్నారు.

నల్లమందు విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్

మీర్‌పేట: నిషేధిత నల్లమందు విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం మీర్‌పేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన ప్రకారం.. రాజస్తాన్‌కు చెందిన అగ్రీవత్ సంతోశ్‌దాస్(38), బుద్ధారామ్ స్నేహితులు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని లెనిన్ నగర్ కాలనీలో ప్రశాంత్‌నగర్‌లో నివసిస్తూ కార్పెంటర్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రాజస్థాన్‌లో నల్లమందును తక్కువ ధరకు కొనుగోలు చేసి నగరంలోని పలు ప్రాంతాల్లో విక్రయించాలని నిర్ణయించుకున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం ఎస్‌ఓటీ పోలీసులతో కలిసి రాత్రి అగ్రీవత్ సంతోశ్‌దాసును అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 1.5 కేజీల నల్లమందును స్వాధీనం చేసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. అతడి మిత్రుడు బుద్ధారామ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

వృద్ధురాలి బలవన్మరణం

తలకొండపల్లి: కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ విషాదకర ఘటన మండల పరిధిలోని చీపునుంతలలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మల్తాకార్ నర్సమ్మ(60) కుటుంబం కొన్ని రోజులుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. దీంతో విరక్తి చెందిన ఆమె బుధవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి పోయింది. సాయంత్రమైన తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తెలిసిన వారందరిని విచారించారు. మిత్రులు, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం ఉదయం గ్రామ శివారులలోని బావి వద్ద అటుగా వెళుతున్న కొందరికి చెప్పులు కనపడడంతో అనుమానంతో బావిలో వెతికగా నర్సమ్మ శవం లభ్యమైంది. కుమార్తె అమృత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, భర్త ఆరేళ్ల క్రితం మృతి చెందాడు. మృతురాలి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

తడబాటు.. ఎడబాటు

తెలిసీ తెలియని వయసులో ఆకర్షణకు లోనవుతున్న యువతీయువకులు భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారు. పెద్దలను కాదని పెళ్లిళ్లు చేసుకున్నా వైవాహిక సంబంధాలు కొనసాగడంతో విఫలమవుతున్నారు. పిల్లల ఉన్నతిపై కోటి ఆశలు పెట్టుకొని కళాశాలకు పంపిన తల్లిదండ్రులకు తీవ్ర విచారాన్ని మిగులుస్తున్నారు.

- చిన్నతనంలోనే ప్రేమ వివాహాలు
- పీఎస్‌లలో పంచాయితీలు
- కొన్నాళ్లకే విడిపోతున్న పలు జంటలు

దౌల్తాబాద్: వారిద్దరూ మైనర్లు.. కళాశాలలో పరిచయమవుతారు.. అది కాస్త ప్రేమగా మారుతుంది. పెద్దలకు ఇష్టం లేకపోయినా పారిపోయి మరి వివాహం చేసుకుంటారు. ఆపై విభేదాలు ప్రారంభమవుతాయి. అవి కాస్త బంధం విడిపోయే వరకు వస్తాయి. ఇలా ప్రస్తుతం సమాజంలో యువత చేజేతులా బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు.

పోలీసులకు ఇబ్బందులు

సమాజంలో ప్రేమ వివాహాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. అయితే ప్రేమకు ఎంత త్వరగా ఆకర్షితులవుతున్నారో అంతే త్వరగా విభేదాలు ప్రారంభమై విడిపోతున్నారు. దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రెండేళ్లుగా సుమారు 20 నుంచి 30కు పైగా జంటలు ఠాణాకు చేరాయి. ఇందులో కొన్ని జంటలు ఒక్కటై సాఫీగా జీవనం సాగిస్తున్నాయి. మరి కొంత మంది విభేదాలతో దూరమై పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. తమ గారాల కుమార్తె కనిపించకపోతే చాలు.. ఆత్రుత పడే తల్లిదండ్రులు వెంటనే పీఎస్‌ల బాట పడుతున్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకోవడం.. ఆ జంటల కోసం గాలించి తీసుకోస్తున్నారు. వివిధ కారణాలతో కేసు విచారణలో కొద్దిగా జాప్యం జరిగినా పోలీసులపైనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కౌన్సెలింగ్ ఇచ్చినా లాభం లేదు

అమ్మాయి కొద్దిగా చనువుగా మాట్లాడితే చాలు దీనినే ప్రేమగా అర్థం చేసుకుని చదువుపై దృష్టి తగ్గిస్తున్నారు. ఒకవేళ వారు ప్రేమగా అంగీకరిస్తే పర్వాలేదు. లేదంటే ఏదో ఒక అఘాయిత్యం చేసుకోవడానికి వెనుకాడడం లేదు. ఈ క్రమంలో కొంత మందిని స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అందులో కొందరు మాత్రమే దూరం కావడానికి అంగీకరిస్తున్నారు. ఎక్కువ మంది విడిపోయేది లేదంటూ ఖరాఖండీగా చెబుతుండడంతో పోలీసులు కూడా ఏమి చేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో అల్లారు ముద్దుగా పెంచిన తల్లిదండ్రులు తీవ్ర దుఃఖంలో మునిగిపోతున్నారు.

- మండల కేంద్రానికి చెందిన యువతి హైదరాబాద్‌కు చెందిన యువకుడు ఓ హాస్పిటల్‌లో పనిచేస్తూ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకొని వారిద్దరూ రెండేళ్లు సాఫీగా సంసారం చేశారు. తర్వాత వారి మధ్య వచ్చిన విభేదాలతో దూరమై పోలీస్‌స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.
- ఇటీవల బాలంపేట గ్రామానికి చెందిన ఓ అబ్బాయి సూర్యాపేట జిల్లాకు చెందిన అమ్మాయిని ప్రేమించి వివాహం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. అయితే ఇరువురి తల్లిదండ్రులు రెండు రోజులు బతిమిలాడినా విడిపోయేది లేదంటూ తేల్చి చెప్పారు. దీంతో అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించుకుంటూ వెళ్లిపోయారు.
- మండల కేంద్రానికి చెందిన ఇద్దరు అమ్మాయిలు ప్రేమ వివాహం చేసుకుని రెండు రోజులు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకునేందుకు పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. తీరా తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినా విడిపోయేది లేదంటూ తెగేసి చెప్పారు.


ఎస్‌ఐకి వివరాలు వెల్లడిస్తున్న ప్రేమ వివాహం చేసుకున్న ఓ జంట తల్లిదండ్రులు (ఫైల్)

అవగాహన లోపం



ప్రస్తుత సమాజంలో యువత ఎవరి మాట లెక్క చేయడం లేదు. దీంతో భవిష్యత్ బుగ్గి పాలవుతుంది. పిల్లలను సన్మార్గంలో నడిపించేందుకు తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నా వారు మాత్రం అడ్డదారులు తొక్కుతున్నారు. తల్లిదండ్రులు చూసిన వివాహాలే చేసుకోవడం ఉత్తమం.

– శ్రీశైలంయాదవ్, ఎస్‌ఐ, దౌల్తాబాద్

విద్యార్థినుల అస్వస్థతపై విచారణ

- జిప్సం ఫ్యాక్టరీపై ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఓపై ఆగ్రహం
- కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

తాండూరు రూరల్: వసతి గృహంలో విద్యార్థినుల అస్వస్థతపై కలెక్టర్ నారాయణరెడ్డి స్పందిచారు. వివిధ దినపత్రికల్లో వచ్చిన కథనాలపై విచారణ జరపాలని తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావును ఆయన ఆదేశించారు. ఈ మేరకు గురువారం మండలంలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న కేజీబీవీ పాఠశాలను ఆర్డీఓ పరిశీలించారు. హాస్టల్‌లో ఉన్న వంట, నీటి సరఫరా గదులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినీలతో ఆర్డీఓ మాట్లాడారు. హాస్టల్ వెనక భాగంలో అపరిశుభ్రత ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీ ఎదుట ఉన్న జిప్సం ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్వాసనతో బాలికలు అస్వస్థతకు గురవుతున్న విషయంపై ఎందుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయలేదని ప్రత్యేకాధికారిణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆర్డీఓ ప్రకటించారు. తర్వాత నిలోఫర్‌లో చికిత్స పొందుతున్న అలేఖ్య బంధువులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ నెల 28వ తేదీ నుంచి అలేఖ్య అనారోగ్యంతో బాధపడటంతో బంధువులు తీసుకెళ్లినట్లు ప్రత్యేకాధికారి తెలిపారు. ప్రస్తుతం ఆమె గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని ఆర్డీఓ వివరించారు. విద్యార్థినీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని సూచించారు.

సెక్యూరిటీ సరిగ్గా లేదు

అనంతరం మండలంలోని చెన్‌గేస్‌పూర్ మార్గంలోని జ్యోతిరావుపూలే బాలికల హాస్టల్‌ను ఆర్డీఓ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. అనారోగ్యానికి గురైన విద్యార్థినీలు మౌనిక, సుమిత్రల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ప్రిన్సిపాల్ నాస్రీతో సమగ్ర వివరాలు సేకరించారు. పాఠశాల్లో మొత్తం 508 మంది విద్యార్థులకు గాను.. ప్రస్తుతం 436 మంది విద్యార్థులు హాస్టల్‌లో ఉన్నారని తెలిపారు. విద్యార్థినీలను పిలిచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉందని అడిగారు. అనంతరం పాఠశాలను సందర్శించి ప్రహరీ గోడ చిన్నగా ఉండడంతో సెక్యూరిటీకి ఇబ్బంది అవుతుందని ప్రిన్సిపాల్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. వారం రోజుల్లో హాస్టల్‌ను సందర్శించాలని ఆర్‌ఐ బాల్‌రాజ్‌ను ఆదేశించారు. తనిఖీలపై పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీఓ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా విద్యాశాఖ ఆదేశాల మేరకు జ్యోతిరావుపూలే హాస్టల్, కేజీబీవీ పాఠశాలను ఎంఈఓ వెంకటయ్య పరిశీలించారు. ఈ మేరకు నివేదికను డీఈఓకు అందజేస్తామని ఆయన తెలిపారు.


కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

అడవుల నరికివేతపై కఠిన చర్యలు


సంగాయపల్లిలో చెట్లను నరికి దగ్ధం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

- జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్

ధారూరు: అడవిని నరికి పోడు భూములుగా మార్చడానికి ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ హెచ్చరించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలోని రాస్నం, జుంటుపల్లి, సంగాయపల్లి అటవీ ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో అడవిలోకి ప్రవేశించి చెట్లను నరికివేస్తున్నారన్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓ అరుణ గుర్తించారన్నారు. ఆమె ద్వారా అడవి నరికివేతపై విచారణ చేయిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతాలతో పాటు ధారూరు రేంజ్‌లోని ఇతర ఫారెస్టు సెక్షన్‌లలో చెట్లను నరికివేస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. సొంత అవసరాల కోసం అడవిలోని చెట్లను నరికివేయడం నేరమన్నారు. అడవిని నరికిన వారిని గుర్తించి కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అటవి సంపదను ప్రజల ఆస్తిగా భావించి చెట్ల సంరక్షణలో తమకు తోడ్పాటు అందించాలని కోరారు. అడవులను నాశనం చేస్తే మానవాళి మనుగడకు నష్టం కల్గిస్తామన్నారు. పోడు పట్టాలు పొంది మళ్లీ అడవిని నరికితే వారికి ఇచ్చిన పట్టాలు రద్దు చేస్తామని ప్రకటించారు. ఫారెస్టు అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కల్పించిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని ఆయన హెచ్చరించారు.

నెత్తిన బోనం.. భక్తితో సమర్పణం

మండలంలోని బొంపల్లిలో బొడ్రాయి, హనుమాన్ దేవాలయ మూడో వార్షికోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా హనుమాన్ దేవాలయంలో పూజలు చేశారు. డప్పు చప్పుళ్లతో రమణీయంగా బోనాల ఊరేగింపు సాగింది. మహిళలు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – దోమ



యాచకుడి మృతి

- మైలార్‌దేవ్‌పల్లిలో జీరో ఎఫ్‌ఐఆర్

పహాడీషరీఫ్: గుర్తు తెలి యని వ్యక్తి మృతదేహానికి సంబంధించి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన జీరో ఎఫ్‌ఐఆర్ కేసు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీ సరిహద్దులోని ఎర్రకుంట పక్కన ఈ నెల 3న సుమారు 35 ఏళ్ల వయసున్న యువకుడు వస్త్రాలు లేకుండా పడిపోయి ఉండడంపై సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. అప్పటికే మృతి చెందడంతో వారు ఈ ఘటనపై జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. మృతదేహం పడి ఉన్న స్థలం పహాడీషరీఫ్ పరిధి కావడంతో గురువారం ఇక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా యువకుడు ఈ నెల 2న కింద పడి మృతి చెందినట్లుగా తెలిపారు. యాచక వృత్తి కొనసాగించే అతని సంబంధీకులెవరైనా ఉంటే తమను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

చల్లబడ్డ నగరం

సాక్షి, సిటీబ్యూరో: నిన్న మొన్నటి వరకు నిప్పులు కురిపించిన సూర్యుడు గురువారం కొంత చల్లబడ్డాడు. పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో పాటు సాయంత్రం ఆకాశంలో మబ్బులు అలముకున్నాయి. భగ్గున మండిన ఎండలకు ఉక్కపోత తోడవడంతో ఉక్కిరి బిక్కిరికి గురైన నగర వాసులు తాజాగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం 40.8 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, బుధవారం 40 డిగ్రీలు నమోదైంది. తాజాగా గురువారం టోలిచౌకిలో అత్యధికంగా 39.3 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఫలక్‌నుమాలో అత్యల్పంగా 35.5 డిగ్రీలు నమోదైంది. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో 39.8 డిగ్రీలు, మేడ్చల్–మల్కాజిగిరిలో 38.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం విశేషం. ఇదిలా ఉండగా గ్రేటర్‌లో పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడం, రాత్రి చలిగాలులు వీస్తుండటంతో కరెంట్ వినియోగంలోనూ భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. ఏప్రిల్ 8న అత్యధికంగా 3914 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదు కాగా, బుధవారం 3492 మెగావాట్లకు తగ్గింది. ఇక తాజాగా గురువారం 3207 మెగావాట్లకు పడిపోవడం గమనార్హం.

ఒకే దొంగ.. ఒకటే కాలనీ

గంట వ్యవధిలో మూడు ఇళ్లలో చోరీలు


వివరాలు సేకరిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఒకే కాలనీలో.. ఒకడే దుండగుడు మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడ ఎస్‌ఎస్‌ఆర్ నగర్‌లో సామల ప్రభాకర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి స్లాబ్‌పై నిద్రించారు. రాత్రి రెండు గంటల సమయంలో ఆయన భార్య బాత్‌రూంకు వెళ్తుండగా తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా పగలగొట్టి బట్టలు చిందరవందరగా పడిఉన్నాయి. ఆమె వెంటనే భర్తను పిలిచి చెప్పగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, రూ.40 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అంతకు ముందు కాలనీలో మరో రెండు ఇళ్ల తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. ఏమి దొరక్క వెనుదిరిగాడు. వస్తువులను చిందరవందరగా పడవేశాడు. గంట వ్యవధిలోనే మూడు ఇళ్లలో దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఒకే వ్యక్తి బైక్ వచ్చి చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కొండాను గెలిపించి మోదీకి కానుకగా ఇద్దాం

కుల్కచర్ల: కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి మోదీకి బహుమతిగా ఇద్దామని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి సోదరి మీరారెడ్డి, ఆ పార్టీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్యారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చెల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవినీతిరహిత పాలన కావాలంటే అందరూ బీజేపీకి ఓటు వేయాలన్నారు. మోదీని మరోసారి ప్రధానిగా చేయడంతో భారతదేశం గౌరవం ప్రపంచ వ్యాప్తం అవుతుందన్నారు. అవినీతి మరకలేని కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి మోదీకి చేవెళ్ల ఎంపీ సీటును బహుమతిగా అందించాలని అన్నారు. కార్యక్రమంలో కల్పనారెడ్డి, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


చెల్లాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పార్టీలకు కోవర్టుల గుబులు

- అభ్యర్థులే ఇతర పార్టీల నేతలకు ఫోన్ కాల్స్
- లోపాయికారి ఒప్పందాలతో గందరగోళం



వికారాబాద్: పార్లమెంటు ఎన్నికల వేళ ప్రధాన పార్టీలకు కోవర్టుల భయం పట్టుకుంది. తమ బలంతో పాటు బలహీనతలు ప్రత్యర్థులకు చేరుతున్నాయనే అనుమానాలతో అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గోప్యత పాటించాల్సిన అంశాలను బయటకు పొక్కకుండా చూడటం ఎలాని ఆందోళన చెందుతున్నారు. ఓ పార్టీలో ఉంటూ మరో పార్టీ నేతలతో అంటకాగడం.. లోపాయికారి ఒప్పందాలు చేసుకొని చివరికి ఏ పార్టీకి సపోర్టు చేస్తారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి ఎంత జాగ్రత్త పడినా తాము రాత్రి అనుకున్న విషయాలు తెల్లారేలోగా పక్క పార్టీలకు చేరుతున్నాయి. ఇలా సమాచార బదిలీకి పాల్పడుతున్న కోవర్టులు పార్టీలకు దడ పుట్టిస్తూ తలనొప్పిగా మారుతున్నారు.

పక్క పార్టీల అభ్యర్థులతో..

మూడు ప్రధాన పార్టీల మధ్య గట్టి పోటీ కనిపిస్తున్న తరుణంలో అభ్యర్థులు తమ గోప్యత విషయంలో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కాగా ఇటీవల ప్రధాన పార్టీల నుంచి పెద్ద నేతలే కండువాలు మార్చిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు మొదలుకుని ఇతర ప్రజాప్రతినిధులు, ద్వితీయ శ్రేణి నాయకుల వరకు ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఇతర పార్టీల్లో సత్సంబంధాలు ఉండటం అయోమయానికి మరింత కారణమవుతుంది. ఇటీవల వికారాబాద్‌లో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఈ విషయం స్పష్టమయింది. తమ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన రంజిత్‌రెడ్డి ఎంత మందికి కాల్స్ చేశారని అడిగితే పదుల సంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు చేతులు ఎత్తడం గమనార్హం.

ఫిరాయింపు నేతలపై అనుమానాలు

పార్టీలలో కోవర్టులు ఏ రూపంలో ఉంటారనేది ఎవరికీ అర్థం కావడం లేదు. ప్రధానంగా కొందరినే నేతలు అనుమానిస్తున్నారు. ఇటీవల జిల్లాలో పార్టీ ఫిరాయింపులు బాగా పెరిగిపోయాయి. ఇలా ఒక పార్టీ నుంచి మరో పార్టీ గూటికి చేరుతున్న నేతలు వ్యూహాలను పక్క పార్టీ నేతలకు చెబుతున్నారనే అనుమానాలు రేకెత్తాయి. ఫిరాయింపు నేతలతో పాటు సొంత పార్టీల్లోనే ఉంటూ అభ్యర్థులపై అసమ్మతి గళం వినిపిస్తూ వస్తున్న నాయకులను అనుమానిస్తున్నారు. ఇలా పార్టీలు మార్చిన వారు గత పార్టీ నేతలతో సన్నిహితంగానే ఉంటుండటం కూడా ముఖ్య నాయకులను కలవరపెడుతోంది.

ఆదరణ తగ్గి.. అంధకారంలో మగ్గి!

- మూతపడిన వసతి గృహాలు
- నిరుపయోగంగా భవనాలు

బంట్వారం: పేద విద్యార్థులకు విద్యను చేరువ చేసే ఉద్దేశంతో నాటి ప్రభుత్వాలు వసతి గృహాలకు ప్రారంభించాయి. నిర్వహణ సరిగ్గా లేక పోవడం, విద్యార్థుల అనాసక్తితో వసతి గృహాలు చాలా కాలం కిందట మూతపడ్డాయి. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు వృథాగా మగ్గుతున్నాయి. మండలంలోని తొర్మామిడి గ్రామంలో 2009 సంవత్సరంలో ఎస్సీ హాస్టల్ భవనం ప్రారంభించారు. ఇందుకు గాను అప్పట్లో బీఆర్‌జీఎఫ్, జెడ్పీ నిధులు అవసరమైన మేరకు వెచ్చించారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ వసతి గృహం ప్రారంభించిన ఏడాది కాలంలోనే హాస్టల్ మూతపడింది. ఊరికి కిలో మీటరు దూరంలో భవనం కట్టించడంతో విద్యార్థులు హాస్టల్‌లో ఉండేందుకు ఇష్టం చూపలేదు. చేసేదేమీ లేక అధికారులు కూడా అప్పట్లో ఏడాదిలోనే మూసివేశారు. భవనం ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉండడంతో ప్రస్తుతం బూత్ బంగ్లాను తలపిస్తుంది.

బంట్వారంలోను అదే పరిస్థితి

మండల కేంద్రం బంట్వారంలోని బీసీ వసతి గృహం పరిస్థితి కూడా అలాగే ఉంది. విద్యార్థులు లేరనే సాకుతో సంబంధిత అధికారులు ఆరేళ్ల కిందట బీసీ హాస్టల్‌ను మూసి వేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 2005 సంవత్సరంలో మత్స్యశాఖ కట్టించిన పక్కా భవనం కట్టిన ఏడాదిలోనే కూలే స్థితికి చేరడంతో అప్పట్లో వెంటనే అద్దె భవనంలోకి హాస్టల్‌ను మార్చారు. చుట్టు పక్కల గ్రామాల విద్యార్థులు దీనిలో ఉంటూ అప్పట్లో బాగానే చదువుకునే వారు. కానీ బీసీ వెల్ఫేర్ అధికారులు 2017 సంవత్సరంలో హాస్టల్‌ను ఎత్తివేశారు. పిల్లలు లేరనే కారణంతో కోట్‌పల్లి ఎస్సీ హాస్టల్‌ను గతంలోనే ఎత్తి వేశారు. కోట్‌పల్లి కొత్త మండలంగా ఏర్పడడంతో హాస్టల్ భవనాన్ని ప్రభుత్వ కార్యాలయాలుగా వాడుకుంటున్నారు.


తొర్మామిడిలో మూతబడిన ఎస్సీ హాస్టల్ భవనం

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

గతంలో బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో సీటు దొరకాలంటేనే పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చేది. రాను రాను హాస్టళ్లకు ఆదరణ తగ్గిపోయింది. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో మూతపడే స్థాయికి చేరుకున్నాయి. గురుకులు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలు వచ్చిన నాటి నుంచి బీసీ, ఎస్సీ హాస్టళ్లలో ఉండే వారు కరువయ్యారు. ప్రాథమిన, జెడ్పీహెచ్‌ఎస్ స్కూళ్ల పరిస్థితి కూడా అలాగే తయారైంది. విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. గురుకులాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో చేరేందుకు మొగ్గు చూపుతున్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: పోటీలతో క్రీడాకారుల నైపుణ్యాలను వెలికితీయవచ్చునని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో మల్లి అంజయ్య జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడా పోటీతో గ్రామాల మధ్య స్నేహ సంబంధాలు పెరుగుతాయన్నారు. గెలుపోటములు సమానంగా స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు మహేశ్, వెంకటేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి